ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 157 | శనివారం 7 మార్చి 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Sathyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

### చిన్నారుల భవిష్యత్తు కోసం

# సోషల్ మీడియాకు చెక్



- సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు
- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు

**అమరావతి (తెలుగోడు),మార్చి 6 :** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13-16 ఏళ్ల లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు

2లో

## యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు..

అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం..



**వాషింగ్టన్ (తెలుగోడు), మార్చి 6 :** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం (మిగతా 2లో)

## బడ్జెట్ లెక్కల్లోనూ కూటమి పచ్చి అబద్ధాలు



- రెండు నెలల్లో రూ.57 వేల కోట్ల సంపద సృష్టి ఎలా సాధ్యం...
- బడ్జెట్‌లో అప్పుల లెక్కలు దాచిపెడుతున్నారు..
- రైతుల భూములను 22ఏలో చేర్చింది చంద్రబాబే..
- గీతం ఆక్రమించిన భూమిని క్రమబద్ధీకరించడం ఎందుకు..
- లడ్డూ ప్రసాదం వివాదంలో మాట మార్చిన పవన్ కళ్యాణ్..
- హెరిటేజ్ ఉత్పత్తుల పంపిణీపై ప్రభుత్వ ఉత్తర్వులు ఎందుకు..

**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 6 :** అసెంబ్లీలో కూటమి నేతలు పచ్చి అబద్ధాలు, కాకి లెక్కలు చెబుతున్నారని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రంగా మండిపడ్డారు. సంపద సృష్టిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు ప్రజలను తప్పుదారి పట్టించే లెక్కలే చెబుతున్నారని ఆయన విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వం చంద్రబాబుకు రూ.8 వేల కోట్ల బడ్జెట్‌ను అప్పగించిందని, కానీ 2019లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి చంద్రబాబు కేవలం రూ.100 కోట్ల బడ్జెట్ మాత్రమే ఇచ్చారని పేర్ని నాని తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై అనేక అబద్ధాలు చెప్పి, వైఎస్ జగన్‌పై విష ప్రచారం చేసి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినప్పటికీ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో స్పష్టంగా చెప్పలేకపోతుందని విమర్శించారు.కరెంట్ చార్జీలు (మిగతా 2లో)

## ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడులు తీవ్రం

డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి



**టెహ్రాన్ (తెలుగోడు),మార్చి 6 :** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు (మిగతా 2లో)

### అమెరికా ఆస్తులపైనే మా దాడులు

పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు.

### వైసిపి పాలన వల్ల

## రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి

- జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం..
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్..
- పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం..
- రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం..
- రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా..
- డిప్యూటీ సిఎం పవన్...



**అమరావతి (తెలుగోడు), మార్చి 6 :** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు (మిగతా 2లో)

### కూటమి ప్రభుత్వానిది

## ఫ్యామిలీ బడ్జెట్

- అన్ని వర్గాలకు లబ్ది చేకూర్చే యత్నం..
- సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశాం..
- మండలిలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి (తెలుగోడు), మార్చి 6 :** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'ఫ్యామిలీ బడ్జెట్' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై చర్చలో ఇతర విషయాలు రావడం బాధాకరమన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యవినిమయ బిల్లుపై మాట్లాడారు. మహిళలకు ఉచిత సిలిండర్లు ఇచ్చి ఆర్థిక భారం తగ్గించామని అన్నారు. మహిళల సమస్యలు తెలుసు కాబట్టే.. ఉచిత బస్సు సదుపాయం కల్పించామన్నారు. సామాన్యుడికి మేలు చేసేందుకే అన్న క్యాంటీన్లు పెట్టినట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులుగా మనం ఏం చేశామన్నదే కీలకం. మనం చేసిన పనులు మాత్రమే చరిత్రలో ఉంటాయి. గత వైకాపా ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలిపెట్టి వెళ్లింది.ప్రస్తుతం ఆ చెత్తను కూడా తొలగించాల్సి వస్తోంది.బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. అప్పులు (మిగతా 2లో)

## టీమిండియా అద్భుత ప్రదర్శన

ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ అభినందనలు



**అమరావతి (తెలుగోడు), మార్చి 6 :** టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్లో గెలుపొంది తుది పోరుకు అర్హత సాధించిన భారత జట్టుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఇంగ్లండ్‌పై టీమ్ఇండియా అద్భుత విజయం సాధించిందని 'ఎక్స్' వేదికగా కొనియాడారు. న్యూజిలాండ్‌తో ఈ నెల 8న జరిగ్గే ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఇదే జోరు కొనసాగించి మరోసారి ప్రపంచ కప్‌ను ముద్దాడాలని ఆయన ఆకాంక్షించారు.ఎంతో అద్భుతమైన మ్యాచ్! ఇంగ్లండ్‌పై అద్భుతమైన విజయం సాధించి ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరిన టీమ్ఇండియాకు అభినందనలు. సంజూ శామ్సన్, శివమ్ దూబెల మెరుపు ఇన్నింగ్స్, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాల చక్కటి బౌలింగ్, అక్షర్ పటేల్ చురుకైన ఫీల్డింగ్‌తో మంచి ప్రదర్శన చేశారు. ఉత్కంఠ (మిగతా 2లో)

### మరోమారు

## బొత్సకు అస్వస్థత

- బిపి హెచ్చు తగ్గులతో అలసట...
- వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు..
- ఆయన ఆరోగ్యం నిలకడగా వుందన్న వైద్యులు..



**అమరావతి (తెలుగోడు), మార్చి 6 :** శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మరోమారు అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ ఇబ్బందిపడటంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన (మిగతా 2లో)

### చంద్రబాబు ఢీల్లీకి..? లోకేష్‌కి కాదు..

## సిఎం కుర్చీ పవన్‌కివ్వాలి

- చంద్రబాబును ఉపప్రధానిగా చేసే ఆలోచనలంటూ ప్రచారం..
- లోకేష్‌ను ముఖ్యమంత్రిగా చేయాలన్న మాటలపై రాజకీయ వేడి..
- చంద్రబాబు వెళ్తే పవన్ కళ్యాణ్‌కే ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్..
- లోకేష్ ముఖ్యమంత్రి అయితే కాపులు ఒప్పుకోరన్న తోట త్రిమూర్తులు..
- ఉగాది తర్వాత మార్పుల అవకాశమంటూ పేర్ని నాని వ్యాఖ్యలు..



**అమరావతి (తెలుగోడు), మార్చి 6 :** రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. బీహార్‌లో జరిగిన రాజకీయ పరిణామాల తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబును జాతీయ రాజకీయాల్లోకి తీసుకెళ్లి ఆయనకు ఉపప్రధాని బాధ్యతలు ఇవ్వాలని భావిస్తున్నారన్న వార్తలు వెలువడుతున్నాయి. అదే సమయంలో ఆయన కుమారుడు లోకేష్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమించాలన్న ఆలోచనలూ ఉన్నాయంటూ చర్చ సాగుతోంది. ఈ ప్రచారం అధికార పక్షానికి అనుకూలంగా భావించే మాధ్యమాల్లోనే రావడంతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది.ఈ అంశంపై (మిగతా 2లో)

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



**అమరావతి (తెలుగోడు), మార్చి 6 :** ఉపాధి హామీ పథకం కింద పల్లెపండుగ రూపంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ఇంకుడు గుంతలు, మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రశ్నకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి పవన్ కళ్యాణ్‌కు బదులు మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం (మిగతా 2లో)

# చిన్నారుల భవిష్యత్తుకోసం సోషల్ మీడియాకు చెక్

(మొదటి పేజి (తరువాయి)

కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బ్జడెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్ధంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నిస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6-7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని, శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు కొనసాగిస్తున్నామని, వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు.

# వైసీపీ పాలనవల్ల రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి

(మొదటి పేజి (తరువాయి)

చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్ లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్లు ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బ్జడెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కూటమి చాలా బలంగా ఉండాలనేది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏపీ అభివృద్ధి కోసమే 2014లో అలయన్స్ కోసం కష్టపడ్డానని తెలిపారు. 2019లో అది సాధ్యం కాలేదని.. 2024లో మరోసారి వెనక్కు తగ్గి పొత్తు పెట్టుకున్నానని ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలంటే మనలో ఏదైనా చిన్నచిన్న సమస్యలున్నా సర్దుకోవాలని దిశానిర్దేశర చేశారు. రాజ్యాంగంలోని మూడు వ్యవస్థలు పరస్పర సహకారంతో పని చేయాలని తెలిపారు. ఏ వ్యవస్థలో లోపాలు ఏర్పడినా ప్రజలకు సేవ చేయటంలో ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. జగన్ అండ్ కో కుట్రలను ఎదుర్కోవాలంటే మనం కలిసి ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను పారదర్శకంగా ఖర్చు చేశామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా వారు అడిగింది ఇవ్వటానికి తాను ప్రయత్నించానని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా తన శాఖల తరపున ఇచ్చిన నిధుల వివరాలు అందజేస్తున్నానని తెలిపారు. బడ్జెట్ వస్తుందంటే ప్రతి ఒక్కరూ ఎన్నో ఆశలుపెట్టుకుంటారని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 15సంవత్సరాలు ఏపీ కోసం కూటమి పని చేస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి బలంగా ఉండాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని అన్నారు. మంత్రులు కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ తమ శాఖల్లో బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పర్యాటక రంగంలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ధాన్యం రైతులకు 24గంటల్లో డబ్బులు జతచేశామని వెల్లడించారు. మూడువేల గ్రామాల్లో తాగునీటి సమస్య గుర్తించామని... అక్కడ తొలి ప్రాధాన్యంగా నీరు ఇస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఏపీవ్యాప్తంగా 48వేల జనావాసాల్లో సురక్షిత తాగునీరు ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2019 నుంచి 2024 మధ్య ఉపాధి హామీ పథకంలో రూ.610కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3,853కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఐదేళ్లలో 880 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేస్తే మనం 6వేల కిలోమీటర్లు వేశామని వెల్లడించారు. వైసీపీ హయాంలో అన్ని రోడ్లు 8,500కిలోమీటర్లు వేస్తే... మనం రెండేళ్లలో 17,500 కిలోమీటర్ల రోడ్లు వేశామని తెలిపారు. చిట్టచివర్లో ఉన్న ప్రజానీకానికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలనే లక్ష్యంతో తాము పనిచేశామని పేర్కొన్నారు. ఇన్ని కష్టాలు, నష్టాలున్నా 11.75 ఆర్థిక వృద్ధిరేటు చూపించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు. కోటి 11లక్షల సివిల్ కేసులు, 3కోట్లకు పైగా క్రిమినల్ కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని గవర్నర్ సూచించారన్నారు. మన వద్ద ఉన్న కోర్టుల సంఖ్య, సిబ్బంది సంఖ్య ప్రకారం ఈ కేసులు ఎప్పటికీ పరిష్కారమవుతాయో చెప్పలేమని అన్నారు. చాలా కోర్టుల్లో కనీస సౌకర్యాలు లేవని.. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేవని... న్యాయశాఖకు సరిపడా నిధులు బ్జడెట్‌లో కేటాయించాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ బ్జడెట్‌లో 100 కోర్టు గదులకు నిధులు కేటాయించటం సంతోషమని చెప్పుకొచ్చారు. ఎవరిపైన కేసు నమోదైనా అది వ్యక్తిగతం కాదని.. వారి కుటుంబం పైనా ప్రభావం చూపిస్తుందని తెలిపారు. వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని గవర్నర్ సూచించారని అన్నారు. కోర్టుల్లో మౌలిక సౌకర్యాలు, సాంకేతిక వ్యవస్థ ఏర్పాటు చేయటం అత్యవసరమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# బడ్జెట్ లెక్కల్లోనూ కూటమి అబద్ధాలు

(మొదటి పేజి (తరువాయి)

తగ్గిస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాబోయే 60 రోజుల్లో రూ.57 వేల కోట్ల సంపద సృష్టిస్తామని చెబుతున్న లెక్కలు పూర్తిగా అవాస్తవమని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రానికి ఆదాయం పెరగడం లేదని, పైగా లోటు పెరుగుతోందని తెలిపారు. అంచనాలకు వాస్తవ పరిస్థితులకు భారీ తేడా కనిపిస్తోందని, చివరికి బడ్జెట్‌లో కూడా నిజమైన లెక్కలు చూపకుండా దొంగతనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది రూ.98 వేల కోట్లు మాత్రమే అప్పు తీసుకుంటామని చెప్పి చివరకు రూ.లక్షా 3 వేల కోట్లు అప్పు తీసుకున్నారని తెలిపారు. ఈ ఏడాది కూడా రూ.97 వేల కోట్ల అప్పు తీసుకుంటామని బడ్జెట్‌లో పేర్కొన్నారని చెప్పారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా తీసుకుంటున్న అప్పులను మాత్రం బడ్జెట్‌లో చూపించకుండా దాచిపెడుతున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని కొన్ని పత్రికలు కూడా వెల్లడించాయని అన్నారు. రెండు నెలల్లో రూ.57 వేల కోట్ల ఆదాయం ఎలా వస్తుందో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని పేర్ని నాని ప్రశ్నించారు. రాష్ట్రం ఆర్థికంగా కుంగిపోతుంటే గాడిలో పెట్టామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నివాసంగా ఉపయోగిస్తున్న కరకట్ట ఇల్లు ఎవరిదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అది లింగమనేని రమేష్‌దా, సీఆర్డీఏదా లేక చంద్రబాబు సొంతమా అన్నది చెప్పాలని అన్నారు. రైతుల భూములను 22ఏ జాబితాలో చేర్చింది చంద్రబాబేనని ఆరోపించారు. ఈ అంశంపై రాజకీయ పార్టీలు, మీడియా సమక్షంలో విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. గుజరాత్‌లో మోటారు వాహనాల సంస్థకు ఎకరా రూ.38 లక్షల చొప్పున భూమి ఇచ్చారని, కానీ ఎకరా రూపాయికే ఇచ్చారని లోకేష్ తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. వాస్తవానికి 1100 ఎకరాలను సుమారు రూ.400 కోట్లకు కొనుగోలు చేసినట్లు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా రూపాయి విలువ పడిపోతుంటే విశాఖలో మాత్రం భూముల విలువ విపరీతంగా పెరిగిందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అందుకే అక్కడ భూములను 99 పైసలకే ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో చిన్న స్థలం ఆక్రమించి ఇల్లు కట్టుకున్న పేదల ఇళ్లను కూల్చివేస్తున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూమిని ఆక్రమించిన గీతం విశ్వవిద్యాలయాన్ని మాత్రం క్రమబద్ధీకరిస్తోందని అన్నారు. గీతం సంస్థ యజమాని నారా లోకేష్‌కు బంధువు కావడం వల్లే ఈ సౌలభ్యం కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. వెయ్యి కోట్ల విలువైన భూమిని తాము ఆక్రమించుకున్నట్లు ఆ సంస్థ యజమానియే చెప్పారని పేర్కొన్నారు. పేదల ఇళ్లు కూల్చి వారి కన్నీటితో కూటమి ప్రభుత్వం కొట్టుకుపోతుందని విమర్శించారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారని పవన్ కళ్యాణ్ తిరుపతి సభలో ఆరోపించారని, కానీ అసెంబ్లీలో మాత్రం మాట మార్చి బాధ్యత దేవస్థానం పాలక మండలిదేనని చెప్పారని అన్నారు. మరోవైపు బోలే బాబా, సంగం, వైష్ణవి, ఏఆర్ వంటి పాలు, పాడి పరిశ్రమలన్నీ చంద్రబాబు కుటుంబంతోనే సంబంధం ఉన్నాయని ఆరోపించారు. హెరిటేజ్ సంస్థకు నాలుగు వేల కోట్ల టర్నోవర్ ఉందని భువనేశ్వరి చెప్పారని, మరోవైపు చంద్రబాబు తనకు లక్ష కోట్ల ఆస్తి ఉందని ప్రకటించారని గుర్తుచేశారు. అయితే అసెంబ్లీలో మాత్రం కుటుంబ జీవనోపాధి కోసం మాత్రమే వ్యాపారం చేస్తున్నామని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని పేర్ని నాని విమర్శించారు. హెరిటేజ్ సంస్థ నుండి కొనుగోలు చేసిన మజ్జిగ ప్యాకెట్లనే ప్రజలకు పంచాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం కూడా అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

(మొదటి పేజి (తరువాయి)

ఇచ్చారు. 2025-26 కోసం బడ్జెట్‌లో రూ.4350కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. 2022 నుంచి ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు సాస్కి కింద రూ.1342కోట్లు వచ్చాయని మంత్రి వివరించారు. పల్లెపండుగ 1 కింద 4 వేల కిలోమీటర్ల మేర వివిధ రోడ్లు వేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు1594 కిలోమీటర్ల రహదారులు వేసినట్లు చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో పల్లెపండుగ 2.0 అమలుపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రశ్న అడిగారు. పల్లెపండుగ కార్యక్రమంలో వేలాది కిలోమీటర్లు రోడ్లు వేశారని.. దీనివల్ల ఎమ్మెల్యేలంతా గౌరవంగా గ్రామాల్లోకి వెళ్లగలుగుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ నిబంధనలను కేంద్రం మార్చిందని.. దీంతో రాష్ట్ర వాటా 10శాతం నుంచి 40శాతానికి పెరిగిందని చెప్పారు. ఆ మేరకు బ్జడెట్‌లో రాష్ట్ర కేటాయింపులు పెంచాలని ఎమ్మెల్యే కోరారు. వైసీపీ హయాంలో జలజీవన్ మిషన్ పథకం సద్వినియోగం చేయలేదని.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉంటుందని.. గతంలో డ్రైనేజీలకు నిధులు ఇవ్వలేదని... ఈసారైనా నిధులివ్వాలన్నారు. పనిదినాలను125 రోజులకు పెంచారని.. దీని వల్ల రాష్ట్రానికి 5 కోట్ల పనిదినాలు పెరిగాయని తెలిపారు. పనులకు సంబంధించి కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని... వాటిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో 21.30 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు వేశామని నాదెండ్ల అన్నారు. డ్రైనేజీ వ్యవస్థలో ఇదో విప్లవమని... చాలాచోట్ల ఈ డిమాండ్ ఉందని చెప్పారు. గత వైసీపీ హయాంలో రూ.13,300 కోట్ల మేర జలజీవన్ మిషన్ నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో నిబంధనలు మార్చారని.. దీనిపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# టీమ్ ఇండియా అద్భుత ప్రదర్శన

(మొదటి పేజి (తరువాయి)

పోరులో సమష్టి పోరాటంతో భారత జట్టు గొప్ప విజయం సాధించి తుదిపోరుకు చేరింది. ఫైనల్లోనూ ఇదే ఆటతీరును ప్రదర్శించాలని కోరుతున్నా' అని చంద్రబాబు అన్నారు. టీమ్‌ఇండియా సమష్టి ప్రదర్శనను మెచ్చి ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కూడా అభినందనలు తెలిపారు. 'సెమీస్‌లో భారత్ అద్భుత ప్రదర్శన కనబర్చింది. సంజూ శామ్సన్, శివం దూబె చక్కటి ఆటతీరుతో టీ20 ప్రపంచకప్ సెమ్గీ÷నైల్లో ఇంగ్లండ్‌పై చిరస్మరణీయ విజయం సాధించాం. ఈ ఆధిపత్య ప్రదర్శనకు జట్టులోని సభ్యులందరికీ అభినందనలు. దేశం మిమ్మల్ని ప్రోత్సహిస్తోంది. ÷నైల్లోనూ మరింత మెరుగైన ప్రదర్శనతో దేశానికి కప్ తీసుకురావాలి' అని లోకేశ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కాగా.. ఇంగ్లండ్‌పై గెలిచిన టీమ్‌ఇండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. టీ20 క్రికెట్లో ఇప్పటివరకూ ఏ జట్టుకూ సాధ్యం కాని ఘనతను సొంతం చేసుకుంది భారత్. పురుషుల పొట్టి ప్రపంచకప్ ఫార్మాట్లో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. పొట్టి క్రికెట్లో అత్యధిక సార్లు 250 ప్లస్ స్కోరు సాధించిన జట్టుగా నిలిచింది. తద్వారా ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ పేరిట ఉన్న రికార్డును బద్దలుకొట్టింది. కాగా.. సూపర్-8లో జింబాబ్వేపై 256 పరుగులు సాధించిన భారత జట్టు.. సెమీస్‌లోనూ 250కి పైగా స్కోరు నమోదు చేసింది. ఈ విజయంతో భారత అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రపంచ క్రికెట్‌లో భారత్ తన బలాన్ని మరోసారి నిరూపించిందని క్రీడాభిమానులు అంటున్నారు.

# టిటిడి పూర్తిస్థాయి ఈవోగా ముద్దాడ

## బాధ్యతలు స్వీకరించిన ముద్దాడ రవిచంద్ర




**తిరుమల (తెలుగోడు), మార్చి 6 :** టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ రవిచంద్ర తిరుమల వేంకటేశ్వరుడి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. తిరుమల యాత్రికులకు సాటి యాత్రికుడిగా సేవ చేస్తానని చెప్పారు. యాత్రికుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో ప్రజలకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

(మొదటి పేజి (తరువాయి)

ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.

# కూటమి ప్రభుత్వానిది ఫ్యామిలీ బడ్జెట్

(మొదటి పేజి (తరువాయి)

చేయడం తప్పు అని నేనెప్పుడూ చెప్పలేదు. చేసిన అప్పులను ఎలా ఉపయోగిస్తామనేది కీలకం. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షనేతలు ఆరోపణలు చేయవద్దని కోరుతున్నానని పయ్యావుల అన్నారు. అంతకుముందు కాగ్ రిపోర్టుపై ప్రతిపక్ష, పాలకపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. రెవెన్యూ, జీఎస్టీ వసూళ్లలో దేశంలో ఏపీ 22వ స్థానంలో ఉందని బొత్స అన్నారు. సున్నా వడ్డీ కింద ఎవరికీ రుణాలు ఇవ్వడం లేదని, మహిళలను లక్షాధికారులను ఎలా చేస్తారో చెప్పాలని నిలదీశారు. పీఎం ఫసల్‌బీమా యోజన అమల్లో లెక్కలు సరిగా లేవని ఆరోపించారు. మొక్కజొన్న, మామిడి, పొగాకు, మిరప, టమాటా, వరికి గిట్టుబాటు ధర రావడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో కొన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. 'సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్' అని మీరే అంటే ఎలా? అని ప్రశ్నించారు. బొత్స ఆరోపణలను మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి ఖండించారు. బొత్సకు వచ్చిన జాబితా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు ఇవ్వాలని మంత్రి పయ్యావుల కోరగా.. అబద్ధాలు చెప్పాల్సిన అవసరం తమకు లేదని బొత్స అన్నారు.

# మరోమారు బొత్సకు అస్వస్థత

(మొదటి పేజి (తరువాయి)

తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. అయితే మూడ్రోజుల విశ్రాంతి అనంతరం శుక్రవారమే బొత్స తిరిగి సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా

ఆయనను మంత్రి లోకేశ్ ఆత్మీయంగా పలకరించారు. 'బొత్స సత్యనారాయణ గారు నమస్కారం' అంటూ పలకరించారు. బొత్స సత్యనారాయణ వినకపోవడంతో వెంటనే కల్పించుకున్న చైర్మన్.. 'మంత్రి నారా లోకేశ్ మిమ్మల్ని పరామర్శిస్తున్నారు' అంటూ బొత్సకు తెలియజేశారు. వెంటనే మంత్రి మాట్లాడుతూ.. 'గురువుగారు చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన తిరిగి ఆరోగ్యంగా హౌస్‌కు రావడం ఆనందంగా ఉంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

# సిఎం కుర్చీ పవన్‌కివ్వాలి

(మొదటి పేజి (తరువాయి)

ప్రతిపక్ష వైసీపీ నాయకులు స్పందిస్తూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేత తోట త్రిమూర్తులు ఈ విషయంపై చిట్ చాట్‌లో మాట్లాడారు. బీహార్‌లో జరుగుతున్న పరిణామాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ మార్పులు వస్తాయన్న ప్రచారం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపప్రధానిగా మారి జాతీయ రాజకీయాల్లోకి వెళ్లే అవకాశం ఉందని ప్రచారం వినిపిస్తోందని చెప్పారు. అలాంటి పరిస్థితి వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని పవన్ కళ్యాణ్‌కు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లోకేష్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని సూచించారు. లోకేష్‌ను నేరుగా ముఖ్యమంత్రిగా చేస్తే కాపు సామాజిక వర్గం ఒప్పుకునే అవకాశం లేదని త్రిమూర్తులు వ్యాఖ్యానించారు.

ఇక ఇదే విషయంపై వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని కూడా స్పందించారు. ఉగాది తర్వాత లోకేష్ ముఖ్యమంత్రిగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇదే అంశంపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య చర్చ జరిగిందని తెలిపారు. తన కుమారుడితో కలిసి పని చేయాలని చంద్రబాబు పవన్ కళ్యాణ్‌ను కోరారని చెప్పారు. ఇద్దరం తరచూ ఢిల్లీకి వెళ్లాల్సి ఉంటుందని చంద్రబాబు పవన్‌కు చెప్పారని పేర్కొన్నారు. ఈ విషయాలు కేంద్ర నిఘా వర్గాల ద్వారా తనకు తెలిసాయని పేర్ని నాని వెల్లడించారు.

ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. అధికార పక్షం నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక స్పందన రాకపోయినా వైసీపీ నాయకుల వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో అధికార మార్పులపై జరుగుతున్న ప్రచారం ఎంతవరకు నిజమో అనే ప్రశ్న కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది

# ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడులు తీవ్రం

(మొదటి పేజి (తరువాయి)

వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహిన్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఘద్ర, సెజ్జిల్, సుమర్ వంటి క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థులతోగేట్స్ కళాశాలయ యాజమాన్యం

## గేట్స్ విద్యార్థుల ఘనత 300కు పైగా ఏఐ ఏజెంట్స్ సృష్టి

**గుత్తి (తెలుగోడు), మార్చి 6 :**
పట్టణ శివారులోని గెట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మరోమారు పరిశోధనలో తమ సత్తా చాటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ప్రత్యేకమైన రికార్డును నమోదు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మరో విశిష్ట మైలురాయిని సాధించారు. కళాశాల చేపట్టిన "ఇయర్ ఆఫ్ ఏఐ" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కలిసి 300కు పైగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఏజెంట్స్‌ను అభివృద్ధి చేసి తమ సృజనాత్మకతను చాటారన్నారు. ఈ విజయంతో గేట్స్ సంస్థలో అమలు చేస్తున్న హ్యాండ్స్-ఆన్ మరియు ప్రాజెక్ట్-బేస్డ్ లెర్నింగ్ విధానం ఎంత ప్రభావవంతంగా ఉందో మరోసారి స్పష్టమైందన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజన్‌తో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కేవలం సిద్ధాంతపరమైన చదువుకే పరిమితం కాకుండా, ప్రత్యక్షంగా ఏఐ సిస్టమ్స్‌ను రూపొందించే అనుభవాన్ని పొందుతున్నారన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు స్టూడెంట్ ఏఐ మెంటర్లు మార్గనిర్దేశం చేస్తూ, వివిధ తెలివైన పనులను నిర్వహించగలిగే ఏఐ ఏజెంట్స్‌ను డిజైన్ చేసి అమలు చేసేలా సహకరించారన్నారు. సంస్థ యాజమాన్యం తెలిపిన ప్రకారం, తమ బలమైన సాంకేతిక నేపథ్యం మరియు వినూత్న దృష్టితో విద్యార్థులను తరువాతి తరం సాంకేతిక రంగాల్లో ముందంజలో నిలిపే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భవిష్యత్తుకు విద్యార్థులను సిద్ధం చ, గేట్స్ ను ఇన్నోవేషన్, టెక్నాలజీ ఆధారిత విద్యకు కేంద్రంగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం మరియు ప్రయత్నం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



గుత్తి డివైఈవోగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మన్నను సన్మానిస్తున్న పలు ఉపాధ్యాయులు

## గుత్తి డివైఈవోగా లక్ష్మన్న బాధ్యతల స్వీకరణ

**గుత్తి (తెలుగోడు), మార్చి 6 :**
గుత్తి డివైఈఓగా లక్ష్మన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేయుచున్న మల్లారెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ప్రభుత్వం ఆయన స్థానంలో లక్ష్మన్నను నియమించింది. కళ్యాణ్ దుర్గం విద్యాశాఖ అధికారిగా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను ఉన్నతాధికారులు గుత్తి డివైఈవోగా నియమించడంతో ఆయన శుక్రవారం గుత్తికి చేరుకొని బాధ్యతలు స్వీకరించారు. గుత్తి కి చేరుకున్న ఆయనకు కోట పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకన్న తో పాటు పలువు ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఎస్ఓ నిర్మల .



**యాడికి (తెలుగోడు), మార్చి 6 :**
యాడికి మండల పరిధిలోని వేములపాడు గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో 2026-27 సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్ఓ నిర్మల తెలిపారు. ఈనెల12న ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అవుతందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఏప్రిల్ 1. ఏప్రిల్ 13న ఎంపికైన వారి జాబితా విడుదలచేస్తారన్నారు. పతి పాఠశాలలో 6వ తరగతిలో 40 సీటు, ఇంటర్మీడియట్ 40 సీట్లు పిఎస్ టిటి గ్రూపులకు ఉంటాయన్నారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలికలు అర్హులు అన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ. 1,20,000 లోపు, పట్టణ ప్రాంతంలో రూ. 1,44,000 లోపు ఉండాలన్నారు. ఓసిలకు 50% (15 సీట్లు), ఎస్సిలకు 15% (5 సీట్లు), బిసిలకు 29% (10 సీట్లు) రిజర్వు చేశారన్నారు. ఇంటర్మీడియట్ 40 సీట్లు పిఎస్ టిటి గ్రూప్‌నకు ప్రవేశ ప్రాధాన్యత బడి బయట ఉన్న బాలికలు, అనాథలు / అర్ధ అనాథలు దివ్యాంగులు లో కనీసం 40% వికలాంగత అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉచిత నివాసంతో కూడిన నాణ్యమైన విద్యను పొందవచ్చు అన్నారు. వీటిని గమనించి విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్ ఓ నిర్మల తెలిపారు.

## బొలికొండ రంగనాథ స్వామిని దర్శించుకున్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్

**గుత్తి (తెలుగోడు), మార్చి 6 :**
గుత్తి మండలం పరిధిలోని తొండపాడు గ్రామం నందు వెలసిన ప్రసిద్ధి చెందిన శ్రీ శ్రీ బొలికొండ రంగనాథ స్వామి వారి దేవాలయాన్ని శుక్రవారం సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యుల పేరు మీద ప్రత్యేక అర్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు . అనంతరం ఆలయ అర్చకులు గుమ్మనూరు ఈశ్వర్ కి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుత్తి మండల కమిటీ అధ్యక్షులు లక్ష్మీ రంగయ్య సీనియర్ నాయకులు చిన్న రెడ్డి యాదవ్ కూటమి నాయకులు పాల్గొన్నారు.



బొలికొండ రంగనాథ స్వామిని దర్శించుకున్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్



సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఇన్నోవేషన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం. కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ 1 గోవిందరాజులు, ఎంఈఓ 2 హరికృష్ణ

# సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనలతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు

### సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆకట్టుకున్న సైన్స్ ఇన్నోవేషన్.. ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి.. ముఖ్య అతిథులు ఎంఈఓ 1 గోవిందరాజులు, ఎంఈఓ 2 హరికృష్ణ, టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున.. చిట్టి బుర్రలు.. పెద్ద ఆలోచనలు..

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 6 :**
విద్య వైజ్ఞానిక ప్రదర్శనలతోనే విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందని ఎంఈఓ 1 గోవిందరాజులు,ఎంఈఓ 2 హరికృష్ణ,టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున, శ్రీనివాస కరస్పాండెంట్ శ్రీనివాసులు, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బెళుగుప్ప లోని సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో సైన్స్ ఇన్నోవేషన్ ( విద్య వైజ్ఞానిక ప్రదర్శన ) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1 గోవిందరాజులు,ఎంఈఓ 2 హరికృష్ణ,టీడీపీ జిల్లా నాయకుల మల్లికార్జున, శ్రీనివాస విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ మారెన్న తో కలసి జ్యోతి ప్రజ్వలనతో సైన్స్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రయోగాత్మకంగా విద్యార్థులకు విద్యను బోధిస్తే కచ్చితంగా విద్యార్థుల్లో మెదడుకు ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. మనందరి నిత్యజీవితంలో సైన్స్ ముడిపడి ఉందన్నారు.ప్రతి ఒక్కరూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.పట్టణాల్లోని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బెళుగుప్ప లోని ప్రైవేట్ పాఠశాలలు ప్రతి ఏటా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారన్నారు. సైన్స్ ప్రాజెక్టులు చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనలతోపాటు, ప్రయోగాల పై మక్కువ పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నతమైన ఆలోచనలతో చదివి సర్ సివి రామన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు సైన్స్, సోషియల్, గణితం



సైన్స్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ 1 గోవిందరాజులు ఎంఈఓ 2 హరికృష్ణ,



సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సైన్స్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ 1 గోవిందరాజులు, ఎంఈఓ 2 హరికృష్ణ

పాఠ్యాంశాలకు సంబంధించిన సుమారు 200పైగా ప్రాజెక్టులను వారు పరిశీలించారు. అందులో సోలార్ సిస్టం,పెండలం, లేయర్స్ ఆఫ్ ద అట్మాస్పియర్, లేయర్స్ ఆఫ్ ద ఎర్త్, రెస్పిరేటరీ సిస్టం, రైన్ హార్వెస్టింగ్, ఎయిర్ పొల్యూషన్ కంట్రోలర్, కార్బన్ ప్యూరిఫికేషన్, సోలార్ పవర్ ఇరిగేషన్ సిస్టం, రూరల్ అర్బన్ సిటీ, ఫండమెంటల్ రైట్స్, వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్, డిఎన్ఏ, రోడ్డు భద్రతా నియమావళి, గణితమునకు సంబంధించిన వివిధ నమూనాలను విద్యార్థులు ప్రాజెక్టులతోపాటు వాటి వివరణ కూడా చాలా అద్భుతంగా వివరించారు. అనంతరం సైన్స్ ప్రాజెక్టులను అద్భుతంగా తయారుచేసి వివరించడం ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మారెన్న ఉపాధ్యాయ బృందంతో కలిసి ముఖ్య అతిథులను మెమెంటోళ్ళతో ఘనంగా సత్కరించారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 గోవిందరాజులు ఎంఈఓ 2 హరికృష్ణ,టీడీపీ జిల్లా నాయకుల మల్లికార్జున, శ్రీనివాస స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్, మైన్ స్కూల్ హెచ్ఎం లక్ష్మీపతి, అంబేద్కర్ కాలనీ స్కూల్ హెచ్ఎం నాగార్జున రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయ బృందం సంధ్య, భారతి,శైలజ, నాగవేణి, మమత, ఎర్రి స్వామి, నవీనబాయి,మాలశ్రీ, శిరీష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న జడ్పీ హైస్కూల్ హెచ్ ఎం వెంకట ప్రసాద్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీప్రసాద్
సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్



సైన్స్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు

## శయనోత్సవంతో ముగిసిన స్వామివారి బ్రహ్మోత్సవాలు

**యాడికి (తెలుగోడు), మార్చి 6 :**
యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం శయనోత్సవంతో ముగిశాయి. శుక్రవారం అఖరి రోజున శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వాముల వారి శయనోత్సవం( ఏకాంత సేవ) తో ముగించాయి. చివరి రోజు పూజా కార్యక్రమాలు యాడికి మండల సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు కుటుంబుకులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీటితో శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ముగించాయి. ఈ కార్యక్రమంలో స్వామివారి భక్తులు నాయకులు బాల రమేష్ బాబు కుటుంబుకులతోపాటు వెల్లపూస వెంకట్రామిరెడ్డి. నగరూరు బ్రహ్మానందరెడ్డి. ఆలయ ఈవో దుర్గాప్రసాద్ ప్రధాన అర్చకులు హరికృష్ణ శర్మ స్వామి మద్యాల సుబ్రమణ్యం. చితంబరి. రోషి రెడ్డి. చలపతి రెడ్డి. పోలా రంగ . రామ్మూర్తి. స్వామివారి భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారికి ఉయ్యాలలో ఊపుతున్న దృశ్యం



చివరి పూజా కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో వస్తున్న నాయకుడు బాల రమేష్ బాబు



శయనోత్సవం పూజా కార్యక్రమంలో బాల రమేష్ బాబు వెంకట్రామిరెడ్డి నగరూరు బ్రహ్మానంద రెడ్డి

## స్వామివారికి పవళింపు సేవ

**యాడికి (తెలుగోడు), మార్చి 6 :**
యాడికి మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ భూదేవి. భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల అనంతరం స్వామివారికి పవళింపు సేవ పల్లకి సేవ చుట్టూ నూనె దీపాలు వెలిగించి స్వామి వారిని ఊయలలో కూర్చోబెట్టి భక్తి పాటలు పాడుతూ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు బాల రమేష్ బాబు ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పూజలు నిర్వహించి అనంతరం పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.





పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకుడు బాల రమేష్ బాబు



మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

## పేద మహిళలకు నిత్యావసరాలు పంపిణీ

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 6 :**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డా.ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో పేద మహిళలకు 26 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు కల్లుమడి రవీంద్రనాథ్, శ్రీమతి రమాదేవి దంపతుల కుమారుడు సుజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమానికి సహకారం అందించినట్లు తెలిపారు. శుక్రవారం ఆదర్శనగర్ లోని పుట్టినిల్లు ఆశ్రమంలో నగర శివారు ప్రాంతాల్లో ఎంపిక చేసినటువంటి 10మంది పేద కుటుంబానికి చెందిన మహిళలకు నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా నిర్మల మురళి మాట్లాడుతూ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారిని 50 ఏళ్లు పై పడ్డాయని వృత్తి నుంచి తొలగించడం ఎంతవరకు న్యాయము తెలుసుకోవాలన్నారు మనం చూపించిన ఉపాధిలో జీవనాన్ని వెతుక్కుని జీవిస్తున్న వారికి బాధ్యతగా ప్రతి ఒక్కరు ఆసరాగా నిలవాలన్నారు. అవసరంలోనూ ఆపదలోనూ ఉన్నవారికి ప్రతి ఒక్కరు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

# కుంచిటిగ సంఘం డైరెక్టర్ పదవి నుంచి తప్పుకున్న ఎన్ .గణేష్

**అమరాపురం (తెలుగోడు), మార్చి 6 :**
మడకశిర నియోజకవర్గం కుంచిటిగ సంఘం డైరెక్టర్ ఇటీవల అమరాపురం మండలం నుంచి ఎంపికైన డైరెక్టర్ ఎన్. గణేష్ ఆ పదవి నుంచి తప్పుకున్నారు. అమరాపురం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శు క్రవారం అయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలవల్ల తాను స్వచ్ఛందంగా డైరెక్టర్ పదవికి నుంచి తప్పుకున్నట్లు తెలిపారు.తనపై ఎంతో నమ్మక విశ్వాసంతో మండలంలోని కుంచిటి వక్కలిగర కులబంధువులు తనను సంఘం డైరెక్టర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరున సింగల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.మడకశిర నియోజకవర్గం ప్రస్తుత సంఘం కార్యవర్గం కాల పరిమితి పూర్తి కావడంతో నూతన కార్యవర్గం ను ఎన్నుకునేందుకు నియోజకవర్గంలోని 5 మండలాల్లో కూడా మండలానికి 6మంది చొప్పున డైరెక్టర్లను ఎంపిక చేసుకునే బాధ్యత ఆయా మండలాల కె పూర్తి బాధ్యతలు అప్పజెప్పిన విషయం తెల్సిందే.



# శ్రీ విధుశేఖర భారతి తీర్థులకు పూర్ణకుంభ స్వాగతం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 6 :**
శ్రీ శృంగేరి శంకర మఠం విశాధిపతులు శ్రీ విధుశేఖర భారతి తీర్థ స్వామివారికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు . యాత్రలో భాగంగా నగరంలోని శారద నగర్ శ్రీ శృంగేరి శంకర మఠం ఆలయానికి స్వామీజీ విచ్చేశారు. శృంగేరి నుండి మార్గమధ్యంలో అనంతపురం లోని శారదా పరమేశ్వరి దర్శించుకుని కర్నూలు జిల్లా జోగులాంబ, శ్రీశైలం నుండి బాపట్ల ద్వారా కాళహస్తి అక్కడి నుండి బెంగళూరు నుండి శ్రీ శృంగేరి శంకర మఠం వెళ్లారు. పుణ్యక్షేత్రాలు యాత్ర చేస్తూ యాత్రలో భాగంగా నగరానికి చేశారు. ఆలయంలోని శ్రీ వినాయక స్వామికి, చంద్రమౌళేశ్వర స్వామికి ఆదిశంకరాచార్యులకు శారదా పరమేశ్వరి మాతకు హారతి ఇచ్చి వెంటనే బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బ్రాంచ్ హెడ్ సత్యప్రసాద్ మాట్లాడుతూ స్వామివారు ఆకస్మికంగా దర్శనానికి రావడంతో నగరంలోని భక్తులకు ప్రజలకు సమాచారం ఇవ్వలేకపోయాము బాధను వ్యక్తం చేశారు. స్వామివారికి ఆలయ అర్చకులు మార్తాండ రామకృష్ణ నరసింహ లు స్వాగతం పలకగా బ్రాంచ్ హెడ్ సత్యప్రసాద్, మేనేజర్ మోహన్ రావు స్వామివారిని ఆహ్వానించారు.



శ్రీ విధు శేఖర భారతి తీర్థులకు పూర్ణకుంభ స్వాగతంపలుకుతున్న పండితులు

# ఆలూరు లక్ష్మీ నరసింహ శాస్త్రికి డాక్టరేట్

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 6 :**
నగరానికి చెందిన ఆలూరు లక్ష్మీ నరసింహ శాస్త్రికి డాక్టరేట్ లభించింది. విలయపత్రంలో శు క్రవారం ఢిల్లీకి ప్రయాణమయ్యారు. సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేస్తోందన్నారు. సేవా రంగంలో సామాజిక అంకితభావానికి ఆయనకు డాక్టరేట్ అందిస్తున్నారు.



# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### ఓపెన్ హౌస్‌లో సిఐ నగేష్ బాబు.

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 6 :**
విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఓపెన్ హౌస్ కార్యక్రమంలో సిఐ నగేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక(బ+)పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం సిఐ నగేష్ బాబు విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా విద్యార్థుల దశ నుండి ప్రతి విద్యార్థి చట్టాలలో ఉన్న సెక్షన్ల గురించి తెలుసుకొని వారి భద్రత విషయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. అలాగే సమాజంలో పోలీసుల పాత్ర గురించి వారికి వివరిస్తూ మహిళా చట్టాలను గురించి అవగాహన కల్పించారు.



విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న సిఐ నగేష్



శ్రీ గురు తిప్పే రుద్రస్వామిరథాన్ని లాగుతున్న భక్తులు

# వైభవంగా వదనకల్లు శ్రీ గురు తిప్పేరుద్రస్వామి రథోత్సవం

**అమరాపురం (తెలుగోడు), మార్చి 6 :**
కర్నాటక తుమకూరు జిల్లా, పావగడ తాలూకు వదనకల్లు గ్రామంలో వెలసిన శ్రీ గురు తిప్పేరుద్ర స్వామి రథోత్సవంన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి వివిధ అభిషేకములు జరిపి ప్రత్యేక అలంకరణచేసి మహా మంగళ హారతినిచ్చి, తీర్థ ప్రసాదం వితరణ చేసారు. దేవాలయశీ ఎదురుగా ఉన్న అగ్నిగుండంలో దూపం, కొబ్బరి తదితరవాటిని వేసి భక్తులు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు. అదేవిదంగా సాయంత్రం గర్భగుడినుంచి స్వామి వారి ఉత్సవ మూర్తిని మేళాతాళాలతో తీసుకొచ్చి వివిధ రకాల పూల మాలలు, గజమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేసిన రథంలో స్వామి వారిని కూర్చుండబెట్టి రథంలాగారు. శ్రీ గురు తిప్పేరుద్ర స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈ ప్రాంత వాసులే కాక, ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్నాటకలోని వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీ గురు తిప్పే రుద్రస్వామికి పూలతో అలంకరణ



శ్రీ గురు తిప్పే రుద్రస్వామి అగ్నిగుండం. హోమం నిర్వహిస్తున్న అర్చకులు

# విద్యుత్ సమస్యల పరిస్కారానికే కరెంటోళ్ల జనబాట

### విద్యుత్ శాఖ అధికారులు..

**అగళి (తెలుగోడు), మార్చి 6 :**
గ్రామాల్లో ప్రజలకు అందించే విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వము"కరెంటోళ్ల జనబాట" కార్యక్రమాన్ని తీసుకువచ్చారని మండల విద్యుత్ శాఖ అధికారులుపేర్కొన్నారు.కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా శు క్రవారం అగళి మండలం కేంద్రంలోని పలు కాలనీలలో విద్యుత్ సిబ్బంది అక్కడి ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లోని విద్యుత్ సరఫరా లో సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వము ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.



రోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మార్చమని తెలియజేస్తున్న గ్రామ ప్రజలు



విద్యుత్ బిల్లును పరిశీలిస్తున్న సీనియర్ లైన్‌మన్ ఉమాపతి

అందులో భాగంగానే ఉన్నతాధికారులు ప్రతి మంగళవారం, శుక్రవారం ఎంపిక చేసిన గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారులు పరిశీలిస్తామని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.ముఖ్యంగా 11 కేవీ, ఎల్ టి లైన్ లో వ్యవసాయ విద్యుత్తు లైన్ల పరిశీలన, క్రిందకు వేలాడే విద్యుత్ తీగలను సరిచేయడం, వాలిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాల గుర్తింపు,తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ దిమ్మెల ఎత్తును పెంచడం లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం చేస్తామన్నారు. గ్రామంలోని ప్రజలు వివిధ రకాల విద్యుత్ సమస్యలను అధికారులు దృష్టికి రావడంతో వాటిని ఆన్లైన్లో నమోదు చేసి పంపినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో విద్యుత్ శాఖ సిబ్బంది సీనియర్ లైన్మెన్ లు ఉమాపతి, నరసింహమూర్తి, జేఎల్ఎండి తిప్పేస్వామి, తదితర సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


# ఆరోగ్య కేంద్రం పనితీరు అధ్వాన్నం..

### ఉదయం సాయంత్రం ఠంచనుగా తెరుచుకుంటున్న తలుపులు .. ఆసుపత్రిలో కనిపించని వైద్య సిబ్బంది.. ఇబ్బందుల్లో రోగులు ..

**అగళి (తెలుగోడు), మార్చి 6 :**
అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం 8:30 గంటలు సమయంలో వైద్య సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను కాపాడుకోవడానికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం సాయంత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తలుపులు మాత్రం తెరిచే ఉంటాయి. కానీ అందులో వైద్యం చేసే సిబ్బంది మాత్రం అందుబాటులో ఉండరు అని ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇరిగేపల్లి గ్రామానికి చెందిన మహిళ నీటి తొట్టిలోకి ప్రమాదవశాత్తు పడిపోవడంతో వెంటనే గమనించి కుటుంబీకులు అగళి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు.అప్పటికే ఆ మహిళ నీళ్లు తాగి స్పృహ కోల్పోవడంతో వెంటనే అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు.అయితే ఆసుపత్రిలో డాక్టర్లు గానీ ఇతర వైద్య సిబ్బంది గానీ ఎవరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోగుల వెంట వచ్చిన వారు వైద్య సిబ్బంది లేరన్న ఆ విషయాన్ని ఆసుపత్రిలో ఫోటోలు వీడియోలు తీస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చర్చ నీయాంశమైంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను కాపాడుకోవడానికి కర్ణాటక రాష్ట్రం సిరా పట్టణానికి తీసుకెళ్లి బంధువులు చికిత్సను అందించి ప్రాణం నిలబెట్టారు.సిబ్బంది వైద్యం కోసం వెళ్ళిన రోగులకు అందుబాటు లో ఉండాల్సిన వైద్య సిబ్బంది లేకుండా బయట తిరుగుతూ అడిగే వారు లేరు కదా అని పత్తాలేకుండా పోతున్నారు.అయితే సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తూ నెలనెలా జీతాలు మాత్రం తీసేసుకుంటూ ఉన్నారని మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ముఖ్యమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ఇలా ఉంటే పంచాయతీలు పల్లెల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు ఎంత మాత్రం అందుబాటులో ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని వైద్య సిబ్బంది సక్రమంగా పనిచేసేలా తగు శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.




అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం




పూలపల్లకి పై ఊరేగుతున్న లక్ష్మీ నరసింహస్వామి ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

# వెండి రథంపై ఊరేగిన శ్రీవారు

**రొళ్ల (తెలుగోడు), మార్చి 6 :**
శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారు పూలపల్లకి పై ఊరేగారు. ఉదయం నుండి స్వామివారికి సుప్రభాత సేవలు నిత్య పూజ గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆంజనేయస్వామి దేవాలయంలో పూల పల్లకి ఉత్సవాలు పురస్కరించుకొని వెండి ఆభరణాలు అలంకరింప చేసి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పూలపల్లకి ని పూలమాలలతో విద్యుత్ అలంకరణలతో ప్రత్యేకంగాలంకరించి ఉత్సవ మూర్తిని అందులో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల గుండా మేళతాళాలతో వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**నేడు దేవత కీర్తనలు..**

పది రోజులు పాటు జరిగే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దేవత కీర్తనలకు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



విద్యుత్ దీపాల అలంకరణతో దేవాలయం



బాధితురాలు శారదమ్మకు బంగారు ఉంగరం అందిస్తున్న దృశ్యం

# పోగొట్టుకున్న బంగారు సొమ్ము అందజేత

### బ్యాంకు మేనేజర్ సూర్య దేవా నాయక్ ..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 6 :**
అమరాపురం కెనరా బ్యాంకులో శారదమ్మ రెండు రోజుల క్రితం పోగొట్టుకున్న 6 గ్రాముల బంగారం చేతి ఉంగరాన్ని శుక్రవారం కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ సూర్య దేవనాయక్ అందజేశారు. అమరాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ అధికారి నరసింహమూర్తి భార్య శారదమ్మ రెండు రోజుల క్రితం బ్యాంకుకు వచ్చింది. బ్యాంకులో పర్సు మరచిపోయింది. అందులో బంగారు ఉంగరం ఉంది. అదే బ్యాంకులో పని చేస్తున్న అటెండర్ నవీన్‌కు ఆ పర్సు దొరకడంతో శారదమ్మను పిలిపించి ఆమెకు బ్యాంక్ మేనేజర్ సూర్య దేవా నాయక్ సమక్షంలో అందజేశారు. అటెండర్ నవీన్ తన నిజాయితీని చాటు చేసుకున్నారు. దీంతో బాధితులు శారదమ్మ బ్యాంకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రకాష్ బ్యాంకు సిబ్బంది బాధితులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆశీస్సులు అందిస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి రాజు

# కష్టమైనా ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించండి

### ఎంఇఓ -1 కృష్ణమూర్ధి రాజు..

**అగళి (తెలుగోడు), మార్చి 6 :**
విద్యార్థులు ఎంతటి అంశాన్ని అయినా ఇష్టపడి చదివితే అది సులభంగా మీ మదిలోకి వెళుతుందని ఎం ఇ ఓ 1 కృష్ణమూర్ధి రాజు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక విజ్ఞానభారతి పాఠశాలలో జరిగిన సరస్వతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మీ భవిష్యత్ కు మంచి పునాది వేసుకోవాలని ఆశీస్సులు అందించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు బాగా ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు




నృత్యం చేస్తున్న విద్యార్థులు

# జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

### వ్యవసాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే కాలవ విన్నపం

**కనేకల్(తెలుగోడు), మార్చి 6 :**
నియోజకవర్గ పరిధిలో రైతులు సాగు చేస్తున్న జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభింప చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చం నాయుడుకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్ లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత రబీ సీజన్లో అనంతపురం జిల్లాలో జొన్న, మొక్కజొన్న సాగు విస్తీర్ణం విస్తరించిందని వివరించారు. ముఖ్యంగా రాయదుర్గం నియోజకవర్గంలో రైతులు ఈ రెండు పంటలను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారని తెలిపారు. 5245 హెక్టార్లలో జొన్న పంట సాగు చేయగా 10,490 మెట్రిక్ టన్నుల దిగుబడి లభించిందని తెలిపారు. ప్రభుత్వం క్వింటాల్ మద్దతుధర రూ.3699 ప్రకటించగా, బహిరంగ మార్కెట్లో కేవలం రూ.2500 మాత్రమే పలుకుతోందన్నారు. అలాగే మొక్కజొన్న 26868 హెక్టార్లను సాగు చేయగా 80,604 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.2400 కాగా, బహిరంగ మార్కెట్లో రూ.1650 నుండి రూ.1700కు కొనుగోలు చేస్తున్నారన్నారు.బహిరంగ మార్కెట్లో పంట దిగుబడులకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. ఈ పరిస్థితిని దళారీలు, ప్రైవేట్ వ్యాపారులు ఆసరా చేసుకుని రైతుల నుండి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ వారిని దోచుకుంటున్నారని వెల్లడించారు. రైతాంగం నష్టపోకుండా ఆర్థికంగా వారిని ఆదుకోవడానికి కనీస మద్దతు ధరపై పంట దిగుబడులు సేకరించేలా వెంటనే బొమ్మన హాల్, కణేకల్లు మండలాలలో రాయదుర్గం లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.



మంత్రి అచ్చన్నాయుడుకు వివరిస్తున్న రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాల్

# పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

### తహసీల్దార్ వేణుగోపాల్..

**కోసిగి (తెలుగోడు), మార్చి 6 :**
కోసిగి జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ఉపాధ్యాయులతో కోసిగి మండల తహసిల్దార్ వేణుగోపాల్ 10వ తరగతి వందరోజుల కార్యాచరణ ప్రణాళిక మరియు ప్రీ ఫైనల్ పరీక్షల ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్జెక్టు వారిగా ఉపాధ్యాయులతో విద్యార్థుల మార్కులను అడిగి తెలుసుకున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి అందరూ పాస్ అయ్యేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు చివరి వరకు సబ్జెక్టులో మెలకువలు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా గణితం, సైన్సు ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రాండ్ టెస్ట్ నిర్వహణ పరిశీలించారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విదంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



సింటెక్స్ నుండి తాగునీటి కోసం వేసిన పైపు లైన్ ధ్వంసం చేసిన ఆకతాయిలు

# రెచ్చిపోతున్న ఆకతాయిలు

### పాఠశాలలో తాగునీటి పైపులు ధ్వంసం..

**కోసిగి (తెలుగోడు), మార్చి 6 :**
కోసిగి మండలం పరిధిలోని డి.బెలగల్లు గ్రామంలో రోజు రోజుకి ఆకతాయిలు ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయి. స్థానిక. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం సింటెక్స్ నుండి ఏర్పాటు చేసిన పైపులను ధ్వంసం చేసి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేకుండా చేయడమే కాకుండా పాఠశాలకు తీవ్రంగా నష్టం కలిగించారని స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ వీరనాగన్న ప్రధానోపాధ్యాయులు అలీ ఖాన్ లు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల కు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో ఆకతాయిలు సాయంత్రం వేళల్లో మద్యం సేవించడానికి దేవాలయం లాంటి పాఠశాల అవరణం ఎన్నుకున్నారని మద్యం తగడమే కాకుండా స్కూల్ ఆస్తులను ధ్వంసం చేయడం దురదుష్టకరమని వారు అన్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో తాగునీరు లేక విద్యార్థులు అల్లాడుతున్నారని ఎవరైనా దాతలు ముందు కొచ్చి పాఠశాలలో తాగునీటి సౌకర్యం కు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 70,780 చెక్కును అందజేస్తున్న దృశ్యం

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

### టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 6 :**
ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దకడబూరు మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి చెందిన రెడ్డి అహ్మద్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 70,780 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలాంటిదిగా మారిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా ఉపశమనం పొందుతున్నాయని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఈ నిధి త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ ఉలిగయ్య, టీడీపీ నాయకులు హజరత్ వలి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం. రామాంజనేయులు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 6 :**



వైసీపీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ ఎం. రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం విడుదల చేసింది. రామాంజనేయులు నియామకంపై స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం మరింత శక్తివంతంగా పనిచేస్తానని తెలిపారు. చేతివృత్తుల వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండల సభ్యులు పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, బూత్ విభాగం తాలూకా చంద్రశేఖర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, చేతివృత్తుల వర్గాల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో విఆర్ఓకి గాయాలు

**కోసిగి (తెలుగోడు), మార్చి 6 :**
కోసిగి-- ఐరన్ గల్లు రోడ్డు లో సజ్జల గుడ్డం గ్రామం సమీపంలో శుక్రవారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదం లో దుద్ది గ్రామానికి చెందిన విఆర్ ఓ హనుమంతు గాయాలు పాలు అయిన సంఘటన చోటుచేసుకునింది. సొంత గ్రామమైన దుద్ది గ్రామం నుండి కోసిగి మీదుగా జంపాపురం గ్రామానికి విధుల నిమిత్తం విఆర్వో హనుమంతు మోటార్ సైకిల్ పై వెల్లుతుండగా జంపాపురం గ్రామం నుండి మోటార్ సైకిల్ పై షామీనాలకు సంబంధించిన కట్టెలు తీసుకొని మోటార్ సైకిల్ పై వెల్లు కోసిగికి తుండగా ప్రమాదవశాత్తూ కట్టెలు తగిలి హనుమంతు ఎదలకు గాయాలు కావడం జరిగింది. విషయం తెలుసుకున్న కోసిగి విఆర్వో లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక చికిత్స కై హనుమంతుని కోసిగి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం 108 లో అదోనికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.



ఎస్ఐ మారుతిని కలిసి సన్మానిస్తున్న చిన్నతుంబళం గ్రామ వైసీపీ నాయకులు

# ఎస్ఐ మారుతిని కలిసిన పలువురు నేతలు

### ఎస్ఐ మారుతికి సన్మానం

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 6 :**
పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ఈ. మారుతిని టీడీపీ, వైసీపీకి చెందిన పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, ఎన్. హనుమంతరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మెుట్రు రామాంజనేయులు, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మునెప్ప, టీడీపీ మండల ఉపాధ్యక్షులు నల్లమల విజయ్ కుమార్, బూత్ యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీ, హెచ్ మురవణి గ్రామ టీడీపీ అధ్యక్షులు బోయ సొంటెన్న, టీడీపీ నాయకులు బాపులదొడ్డి నర్సిరెడ్డి, హులికన్వి సత్యన్న, నౌలేకల్ నాగేష్, నరసయ్య, కోడిగుడ్ల దుబ్బన్న, హనుమాపురం బీపీ ఈరన్న, రాజశేఖర్ ఎస్ఐ మారుతిని కలిసి శాలువా, డీలర్ రంగస్వామి కప్పి పూలమాలలతో సత్కరించారు. అలాగే జాలవాడి గ్రామ అధ్యక్షులు బోయ యంకన్న, భీమేష్, భీమన్న, శాంతప్ప, తాయన్న, ఓంకార్, రమేష్, ఏసన్న ఎస్ఐ మారుతిని కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసీపీ ప్రచార విభాగం తాలూకా అధ్యక్షులు ముక్కరన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొగ్గుల అర్లప్ప, వైసీపీ నాయకులు ప్రసాద్, కుమార్, కొరవ సుందరం, జోమన్న, ముగతి ఏసన్న, సుందరరాజు ఎస్ఐ మారుతిని కలిసి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నతుంబళం గ్రామ వైసీపీ నాయకులు చిన్న వీరేష్, బాపురం హనుమంతరెడ్డి, పెద్ద వీరేష్, యోహాను, చాకలి పెద్ద నారాయణ, ఉసేని, ఇస్సాక్ ఎస్ఐ మారుతిని కలిసి శాలువా కప్పి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని శాంతిభద్రతలు, రాజకీయ పరిస్థితులపై చర్చించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని ఎస్ఐ కోరారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని, ప్రజలు శాంతియుతంగా జీవించడానికి వాతావరణాన్ని కల్పిస్తామన్నారు.



ఎస్ఐ మారుతిని కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసీపీ నాయకులు.



కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ మారుతిని కలిసి సన్మానిస్తున్న జాలవాడి టీడీపీ నాయకులు



ఎస్ఐ మారుతిని కలిసి శాలువా కప్పి సన్మానిస్తున్న టీడీపీ నాయకులు., హనుమాపురం టీడీపీ నాయకులు

# టీడీపీ నేత కోడిగుడ్ల ఏసేపును పరామర్శించిన నాయకులు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 6 :**
పెద్దకడబూరు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు ఇటివల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, ఎన్. హనుమంతరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మెుట్రు రామాంజనేయులు, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మునెప్ప, టీడీపీ బూత్ యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీ, టీడీపీ నాయకులు బాపులదొడ్డి నర్సిరెడ్డి, హులికన్వి సత్యన్న, రంగాపురం తిక్కయ్య శుక్రవారం కోడిగుడ్ల ఏసేపును పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కోడిగుడ్ల ఏసేపు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపును పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

# వంశధార జలాశయం.. శ్రీకాకుళం జిల్లాకు వరం

### జలాశయంలోకి ఎత్తిపోతల ద్వారా నీటి మళ్ళింపు .. సాగు, త్రాగు నీటి సరఫరాకు దోహదం .. టూరిజం కేంద్రంగా జలాశయం అభివృద్ధి.. జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ..

**హిరమండలం (తెలుగోడు), మార్చి 6 :**
హిరమండలం వద్ద నిర్మాణం చేపట్టిన వంశధార జలాశయం శ్రీకాకుళం జిల్లా వరంగా మారుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. .సాగు, త్రాగు నీటి సరఫరా కు దోహదం పడుతుందన్నారు. జలాశయం ప్రాంతం టూరిజం కేంద్రం గా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జలాశయం, ఎత్తి పోతల పథకం పనులను జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 19 టిఎంసిల సామర్థ్యంతో జలాశయం నిర్మాణం చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం 5టిఎంసిలు నీటిని జలాశయం నిల్వ జరుగుతుందని తెలిపారు. గొట్టా బ్యారేజి ప్రాజెక్టు అనుసంధానం ఉన్న కుడి ప్రధాన కాలువ ద్వారా వంశధార నదీ నీటిని జలాశయంలోకి మళ్లింపు కు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీటి ద్వారా 15 టిఎంసి ల వరకు జలాశయం లోకి నీటిని మళ్లించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రాబోయ వర్షాకాలంలో నదీ కి వచ్చిన వరద నీటిని మళ్ళింపు కు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 55 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. జలాశయం లో నిర్దేశించిన సామర్థ్య నిల్వలు ద్వారా ఖరీఫ్, రబీ లో రెండో పంట కు సాగు నీరు అందించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఉద్దానం ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాలకు ప్రజలకు శుద్ధ త్రాగు నీరు సరఫరా చేస్తుండగా, భవిషత్తు లో ఉద్దానం ప్రాజెక్టు 2,జల జీవన్ మిషన్ పథకం ద్వారా పాతపట్నం, నరసన్నపేట, టెక్కలి తో పాటు మరిన్ని ప్రాంతాలకు త్రాగు నీరు సరఫరా అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే జలాశయం ప్రాంతం టూరిజం కేంద్రం గా అభివృద్ధి కి అవకాశాలు ఉన్నాయని, ఇందుకోసం ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. జలాశయం ద్వారా జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో వంశధార, ట్రాన్స్ కో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



వంశధార జలాశయం పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్



వంశధార జలాశయం పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్



డ్రంకెన్ డ్రైవ్‌లో శిక్ష పడిన డ్రైవర్

# తాగి వాహనం నడిపినందుకు 7 రోజులు జైలు శిక్ష

**కోసిగి (తెలుగోడు), మార్చి 6 :**
కోసిగి పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన కోసిగికి చెందిన ఆరేకేరి ఈరేష్‌కు ౭ ఆదోని కోర్టు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్పై రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం చాలా ప్రమాదకరమైన పనిఅని ఇది డ్రైవర్‌కు మాత్రమే కాకుండా రోడ్డుపై ప్రయాణించే ఇతరులకు కూడా ప్రాణాపాయం కలిగిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయని , మద్యం సేవించినప్పుడు మనిషి స్పందించే వేగం తగ్గిపోతుందని. దీంతో వాహనం నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రాణ నష్టం డ్రంకెన్ డ్రైవింగ్ వల్ల చాలాసార్లు తీవ్ర ప్రమాదాలు జరిగి డ్రైవర్‌తో పాటు ఇతర నిరపరాధులు కూడా ప్రాణాలు కోల్పోతారని గాయాలు మరియు వికలాంగత్వం ప్రమాదం వల్ల తీవ్రమైన గాయాలు, జీవితాంతం వికలాంగత్వం వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. చట్టపరమైన శిక్షలుమద్యం సేవించి వాహనం నడిపితే ట్రాఫిక్ చట్టాల ప్రకారం జరిమానా, జైలు శిక్ష లేదా డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్ వంటి శిక్షలు విధించబడతాయని, కుటుంబానికి ఇబ్బందులు డ్రైవర్‌కు ప్రమాదం జరిగితే అతని కుటుంబం ఆర్థికంగా మరియు భావోద్వేగంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని అన్నారు. సామాజిక బాధ్యత కోల్పోవడం మద్యం సేవించి వాహనం నడపడం సమాజానికి ప్రమాదం కలిగించే నిర్లక్ష్యమైన ప్రవర్తనగా పరిగణించబడుతుందన్నారు. మద్యం సేవించినప్పుడు వాహనం నడపకండి. అవసరమైతే క్యాబ్, ఆటో లేదా మిత్రుల సహాయం తీసుకోండి. మీ ప్రాణాలు మరియు ఇతరుల ప్రాణాలు కాపాడండని రమేష్ రెడ్డి తెలిపారు.



ప్రమాదంలో గాయపడ్డ రైతులు

# రెండు మోటార్ సైకిళ్ల ఢీ.. నలుగురుకి తీవ్ర గాయాలు

**కోసిగి (తెలుగోడు), మార్చి 6 :**
మండల కేంద్రమైన కోసిగి గ్రామ శివార్లలోని బొట్ల వాళ్ళ తోట దగ్గర కోసిగి--ఆదోని రోడ్డులో రెండు మోటార్ సైకిళ్ళ ఢీ కొని కోసిగి కి చెందిన నలుగురి వ్యక్తులకు తీవ్ర రక్త గాయాలు అయిన సంఘటన శుక్రవారం నాడు చోటుచేసుకునింది.. కోసిగి గ్రామం ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటూ ఆర్ ఎం పి డాక్టర్ గా ప్రాక్టీస్ చేస్తున్న ఈడిగ నాగరాజు ఆదోని నుండి కోసిగి కి హెూండా యూనికాన్ మోటార్ సైకిల్ పై వస్తూ ఉండగా కోసిగి మూడవ వార్డు కు చెందినరైతులు మాను కింద తాయన్న, లింగలదిన్నె కోసిగయ్య, బుల్లి కర్రెయ్య లు ముగ్గురు కలసి ఆదోని వ్యవసాయ కమిటీ కి బుడ్డలు అమ్మడానికి వెళుతుండగా ఒకే టివిఎస్ ఫిఫ్టీ పై వెళుతుండగా రెండు మోటార్ సైకిళ్ళు ఢీ కొని నలుగురికి తీవ్ర రక్త గాయాలు కావడం జరిగింది. కాగా ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇందులో ఇద్దరిని హుటాహుటిన కార్ లో ఆదోని ఆసుపత్రికి తరలించగా, మరో ఇద్దరిని 108 అంబులెన్స్ లో ఆదోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని రోడ్డు ప్రమాదానికి గురైన మోటార్ సైకిళ్లను పోలీస్ స్టేషన్ కు తరలించి ఎస్పై రమేష్ రెడ్డి తెలిపారు.

# నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**ఎల్ ఎన్ పేట (తెలుగోడు), మార్చి 6 :**
శివాజీ ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రాజులమ్మ భర్త చనిపోవడంతో దుర్భరమైన జీవనం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా ప్రతీ నెల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు, శివాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఆద్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. భవిషత్తు లో నిరుపేదలను ఆదుకోవడానికి సేవా కార్యక్రమాలు విస్తరించినున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలరాం మహంతి, రాజేంద్ర పాణి గ్రాహి, రవీంద్ర పాణి గ్రాహి కిషోర్ పాణి గ్రాహి,బలరాం పండా, కిషోర్ పండా రమేష్ పాణి గ్రాహి,చెంద్రినాయుడు,చెరుకూరి. కృష్ణ , రాజు, జి. శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న శివాజీ ఫౌండేషన్ సభ్యులు




# పెద్ది నుంచి జాన్వీకపూర్ వీడియో విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'లో కథానాయిక జాన్వీ కపూర్ ఈరోజు తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్వీని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ సినిమాలో జాన్వీ కపూర్ 'అచియమ్మ' అనే పాత్రలో కనిపించబోతోంది. బుచ్చిబాబు తన ట్వీట్‌లో.. 'నీతో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. స్క్రీన్ మీద అచియమ్మగా నీ పవర్‌ఫుల్ అవతారాన్ని ప్రపంచం చూడబోతున్నందుకు నేను చాలా ఎ÷-జగైటెడ్‌గా ఉన్నాను' అంటూ పేర్కొన్నారు. విడుదలైన పోస్టర్‌లో జాన్వీ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. గతంలో శ్రీదేవి - చిరంజీవి జోడీ వెండితెరపై సృష్టించిన మ్యాజిక్ గురించి తెలిసిందే. ఇప్పుడు వారి వారసులు రామ్ చరణ్ - జాన్వీ కపూర్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.


# ఆసక్తిగా సాగే.. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'





టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ సుదీర్ఘ విరామం తర్వాత జంటగా నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రైమ్ కామెడీ డ్రామాను శివాజీ స్వయంగా నిర్మించారు. భారీ అంచనాల మధ్య శుక్రవారం విడుదలైంది. హార్షిలి హిల్స్‌లో నివసించే శ్రీరామ్ (శివాజీ) ఒక నిజాయితీ గల పంచాయతీ కార్యదర్శి. తన భార్య ఉత్తర (లయ), రీల్స్ పిచ్చితో వింత పనులు చేసే కొడుకు నితిన్ అలియాస్ బిట్టు (రోహన్)తో కలిసి సాధారణ జీవితం గడుపుతుంటాడు. అయితే, ఆడవాళ్ల పిచ్చి ఉన్న స్థానిక ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్), శ్రీరామ్ లేని సమయంలో ఉత్తరపై కన్నేసి వారి ఇంటికి వస్తాడు. కానీ ఊహించని విధంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. ఆ హత్య కేసు నుండి తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి శ్రీరామ్ ఏం చేశాడు? శవాన్ని మాయం చేసే క్రమంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులేంటి? మరోవైపు కోటి రూపాయల గిఫ్ట్ బ్యాగ్ కోసం ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట ఎందుకు పడింది? ఈ గందరగోళంలో కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్) పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం. దర్శకుడు సుధీర్ శ్రీరామ్ ఒక డార్క్ క్రైమ్ థ్రిల్లర్‌ను వినోదాత్మకంగా మలచడంలో సఫలమయ్యాడని చెప్పవచ్చు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినప్పటికీ, పాత్రల చిత్రణ మరియు కథనాన్ని నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సినిమా ఆరంభంలో పాత్రల పరిచయం, ఆ తర్వాత వచ్చే మలుపులు ప్రేక్షకుడిని కథలోకి తీసుకెళ్తాయి. అయితే ఎప్పుడైతే హత్య జరుగుతుందో, అక్కడి నుండి కథ థ్రిల్లింగ్ మోడ్‌లోకి మారుతుంది. శవాన్ని మాయం చేసేందుకు హీరో వేసే ప్లాన్లు, మరోవైపు ఎమ్మెల్యే మనుషుల నుంచి తప్పించుకునే సీన్లు ఆసక్తిని కలిగిస్తాయి. అయితే, ద్వితీయార్థంలో అక్కడక్కడా కథనం కాస్త నెమ్మదించినట్లు అనిపిస్తుంది. శివాజీ తనదైన టైమింగ్ మరియు అనుభవంతో శ్రీరామ్ పాత్రలో ఒదిగిపోయారు. మధ్యతరగతి తండ్రి పడే తపనను చక్కగా పండించారు. చాలా కాలం తర్వాత తెరపై కనిపించినా, తన నటనతో అలరించింది లయ. ఇక కొడుకు పాత్రలో రోహన్ తన అల్లరితో నవ్వించగా, ధనరాజ్ పాత్ర చివరిలో సర్ప్రైజ్ చేస్తుంది. శరత్ లోహితాశ్వ, ప్రిన్స్ తమ పరిధి మేరకు నటించారు.

# క్రైమ్ థ్రిల్లర్‌గా మృత్యుంజయ్

గత వారం 'విష్ణు విన్యాసం'తో నవ్వులు పూయించిన టాలీవుడ్ నటుడు శ్రీవిష్ణు గ్యాప్ లేకుండా మరో కొత్త సినిమాతో ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మృత్యుంజయ్. రెబా మోనికా జాన్ కథానాయికగా నటించగా.. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంది అనేది రివ్యూలో చూద్దాం. శ్రీవిష్ణు ఒక న్యూస్ రిపోర్టర్. క్రైమ్ బ్యూరోలో పనిచేయాలనేది తన కల, కానీ అవకాశం దొరకక ప్రస్తుతానికి అడ్వర్టైజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తుంటాడు. ఎవరైనా మరణిస్తే, వారి ఇంటికి వెళ్లి ఆ వ్యక్తి గొప్పతనం గురించి రాసి, కుటుంబ సభ్యుల నుండి శ్రద్ధాంజలి ప్రకటనలు సేకరించడం అతడి వృత్తి. ఈ క్రమంలో అచ్యుత్ రావు (బాలాదిత్య) మరణం జయ్‌ను కదిలిస్తుంది. అచ్యుత్ కూతురు అంజలి తన తండ్రి మరణం వెనుక ఉన్న కారణాన్ని అడగడంతో, జయ్ ఆ బాధ్యతను భుజానికెత్తుకుంటాడు. వరుసగా జరుగుతున్న కొన్ని మరణాలు ప్రమాదాలు కావని, పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతున్న హత్యలని జయ్ గుర్తిస్తాడు. ఈ కేసును ఇన్వెస్టిగేట్ చేస్తున్న ఐపీఎస్ అధికారి సీత (రెబా మోనికా జాన్)తో కలిసి జయ్ ఆ హంతకుడిని ఎలా పట్టుకున్నాడు? ఆ కిల్లర్ అసలు లక్ష్యం ఏమిటి? అన్నదే మిగతా కథ. ర్శకుడు హుస్సేన్ షా కిరణ్ ఒక విభిన్నమైన పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించారు. కేవలం హత్యలు, ఇన్వెస్టిగేషన్ మాత్రమే కాకుండా, హీరో-విలన్ మధ్య సాగే మైండ్ గేమ్ సినిమాకు ప్రధాన బలమై నిలిచింది. సినిమా ప్రారంభంలో పాత్రల పరిచయం, హీరో చేసే వింతైన ఉద్యోగం ఆసక్తికరంగా ఉంటాయి. అయితే కథ అసలు పాయింట్‌కి రావడానికి కొంత సమయం తీసుకుంటుంది. ద్వితియార్థంలో సినిమా వేగం పెరుగుతుంది. హీరో-విలన్ ఒకరికొకరు తెలియకుండానే ఎదురుపడే సన్నివేశాలు, ఒకరి ఎత్తులకు మరొకరు పై?త్తులు వేయడం ఉత్కంఠను కలిగిస్తాయి. ముఖ్యంగా క్లైమాక్స్ వరకు సస్పెన్స్ మెయింటైన్ చేయడంలో దర్శకుడు సఫలమయ్యారు. శ్రీవిష్ణు తన మార్కు కామెడీని పక్కన పెట్టి, చాలా సీరియస్ రోల్‌లో ఒదిగిపోయాడు. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ పాత్రకు తగ్గట్లుగా ఉన్నాయి. రెబా మోనికా జాన్ కేవలం గ్లామర్ కోసమే కాకుండా, ఒక బాధ్యతాయుతమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో మెప్పించింది. వీర్ ఆర్యన్ ప్రతినాయకుడిగా వీర్ ఆర్యన్ నటన ఆకట్టుకుంటుంది. కొన్ని సీన్స్‌లో తన నటనతో భయపెట్టారు.




# వృషకర్మ గ్లింప్స్ అద్భుతం: సుకుమార్

యువసామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్ చూసిన ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. సుకుమార్ రైటింగ్స్ కూడా ఈ నిర్మాణంలో భాగస్వామి కావడంతో, ఆయన ఈ అవుట్‌పుట్ పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.సుకుమార్ అభినందనలపై నాగచైతన్య ట్విట్టర్ (ఛీ) వేదికగా స్పందిస్తూ.. 'థాంక్యూ సుకుమార్ గారు. మీలాంటి విజనరీ నుంచి ఇలాంటి మాటలు రావడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. మీ ప్రశంసలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక్ దండు రూపొందించిన ఈ సూపర్ నేచురల్ ప్రపంచం సుకుమార్‌ను సైతం ఆశ్చర్యపరిచిందని చైతూ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోంది. గతంలో కార్తీక్ దండు రూపొందించిన 'విరూపాక్ష' చిత్రానికి సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'వృషకర్మ'తో తన శిష్యుడు మరో అద్భుతాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడని సుకుమార్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. దీంతో ఈ గురు-శిష్యుల బాండింగ్.. చైతన్యతో వారి అనుబంధం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.




# మాస్ రోల్‌లో శర్వానంద్..భోగి

ఇటీవలే 'నారీ నారీ నడుమ మురారి'తో క్లాస్ హిట్ అందుకున్న శర్వానంద్, ఇప్పుడు రూట్ మార్చి పూర్తి స్థాయి మాస్ రోల్‌లో కనిపించబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంలో నటిస్తుండగా. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'ధమాకా' ఫేమ్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండటంతో పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన శర్వానంద్ లుక్ చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద ఈసారి మాస్ జాతర ఖాయమనిపిస్తోంది. దీనికి తోడు నేడు శర్వానంద్ పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఒక స్పెషల్ రఫ్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు సంపత్ నంది ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'మొన్న గంగని చూశారు.. ఇప్పుడు పెను గంగని చూడండి' అంటూ తన హీరో క్యారెక్టర్‌కు పవర్‌ఫుల్ ఎలివేషన్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో శర్వానంద్ గడ్డంతో, ఇంటెన్స్ లుక్‌లో చాలా డైనమిక్ గా కనిపిస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లోనే ఇది మోస్ట్ మాస్ ఫిల్మ్ అవుతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక శ్రీ శ్రీనివాస సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 28, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రజంట్ శర్వ లుక్ వైరల్ అవుతుంది.


Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.